సాక్షి ప్రకాశం

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పూర్తి

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపిక జే పంగులూరులో నిర్వహించారు. - 8లో..



జీవనశైలి మార్పుతోనే గుండెకు రక్ష

మనిషి జీవన శైలి, ఆహారపు అలవాట్ల మార్పుతోనే గుండెను రక్షించుకోవచ్చని ఎంపీ మాగుంట, కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దివ్యాంగులతో మెగా ఎగ్జిబిషన్ కం ఫెయిర్

ఒంగోలు: నేషనల్ హ్యాండిక్యాప్డ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 6 నుంచి 15వ తేదీ వరకు మెగా ఎగ్జిబిషన్ కం ఫెయిర్‌ను సికింద్రాబాద్‌లో నిర్వహిస్తారని, దివ్యాంగులు వారి నైపుణ్యంతో తయారు చేసిన వస్తువుల ప్రదర్శనకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు జి.అర్చన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల దివ్యాంగులు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో దరఖాస్తు పొంది పూరించి అక్టోబర్ 3వ తేదీలోగా మళ్లీ అదే కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రైల్వే ఆస్తులు పరిశీలించిన ఐజీ



దర్శిలో పాత ఇనుము సామాను దుకాణం వారితో మాట్లాడుతున్న రైల్వే ఐజీ

దొనకొండ: దర్శి నియోజకవర్గ పరిధిలో కొన్ని రోజుల క్రితం రూ.83 లక్షల విలువ చేసే రైల్వే కేబుల్ చోరీకి గురైంది. ఈ నేపథ్యంలో దొనకొండ రైల్వే స్టేషన్‌కు దక్షిణ మధ్య రైల్వే ఐజీ ఆరోమ్ సింగ్ ఠాగూర్ శుక్రవారం వచ్చారు. రైల్వే కేబుల్ చోరీ వ్యవహారం దర్శి ప్రాంతంలో వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈ దొంగతనం సంవత్సరం నుంచి జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట గుంటూరు డివిజన్ కమిషనర్ కె.సత్యహరప్రసాద్, సీఐలు తిరపతిరావు, నాగరాజు, వీఎస్ సింగ్, ఏఎస్ఐలు క్రాంతికుమార్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

దర్శి పాత ఇనుము దుకాణాల్లో తనిఖీ

దర్శి: దర్శి పాత ఇనుము సామాన్ల దుకాణంలో రైల్వే ఐజీ ఆరోనుసింగ్‌ఠాగూర్ తనిఖీ చేశారు. గతంలో రైల్వే సిగ్నల్‌కు సంబంధించిన రాగితీగను దొంగిలించి దర్శి పాత ఇనుము సామాన్ల దుకాణంలో అమ్మగా రైల్వే అధికారులు గుర్తించి ఆ తీగను రికవరీ చేసి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మరి కొన్ని విషయాలు తెలుసుకోవాలని ఐజీ ఇనుప దుకాణంలో పరిశీలించి వారితో మాట్లాడారు. ఆయన వెంట సీఐ జే రామకోటయ్య ఉన్నారు.

పాపం పసిపాప ఏమైందో ?

- నంతనూతలపాడు మండలం మద్దులూరులో ఐదేళ్ల పాప అదృశ్యం
- ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్సైలు పాప ఆచూకీ కోసం వెతుకులాట



మనుబ్రోలు రమ్య (ఫైల్)

చీమకుర్తి: ఐదేళ్ల కూడా నిండని పసిపాప మనుబ్రోలు రమ్య అదృశ్యమైంది. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం మద్దులూరు గ్రామంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. రమ్య తన అక్కతో పాటు మద్దులూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్తోంది. బడి ఈడు వయస్సు లేకపోయినా తన అక్క ఐదో తరగతి చదువుతుంటే అక్కతో కలిసి రోజులాగే శుక్రవారం కూడా బడికి వెళ్లింది. సాయంత్రం ఇంటర్వెల్‌లో రమ్య ఇంటికి వెళ్తానంటే బడిలో ఉన్న టీచర్ పంపించాడు. రోడ్డు మీద వేరే పేరెంట్ వెళ్తుంటే ఆ పేరెంట్‌తో కలిసి రమ్య వెళ్లింది. కానీ పేరెంట్ ఇల్లు మధ్యలోనే ఉండటంతో అక్కడి నుంచి రమ్య ఒక్కతే వెళ్లినట్లు స్థానికులు చెబున్నారు. తీరా సాయంత్రం 4 గంటలకు బడి వదిలినప్పుడు రమ్య అక్క ఇంటికి రాగానే రమ్య ఏదని తల్లి కోటేశ్వరి అడగటంతో ఇంటర్వెల్‌లోనే ఇంటికొచ్చిందని అక్క చెప్పటంతో రమ్య అదృశ్యమైనట్లు తల్లి గుర్తించి తల్లిదండ్రుల ద్వారా గ్రామంలోని పరిసరాలను వెతికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఒంగోలు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, సింగరాయకొండ సీఐ రంగనాథ్, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, టంగుటూరు, కొండపి ఎస్సైలతో పాటు ఒంగోలు పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి మరో ముగ్గురు ఎస్సైలు కలిసి అదృశ్యమైన పాప ఆచూకీ కోసం మద్దులూరు గ్రామాన్ని జల్లెడ పట్టారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి పాఠశాల, బాత్‌రూములు, అనకర్లపూడి వైపు ఉన్న ఆక్వా పరిశ్రమలు, మూసీ నదివైపు స్థానిక గ్రామస్తులతో పాటు పోలీసులు పాప ఆచూకీ కోసం తీవ్రంగా గాలించారు. అయినా రాత్రి 10 గంటల గడిచినా పాప ఆచూకీ లభించకపోవడంతో పాప తల్లి కోటేశ్వరి, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. పాప తండ్రి రామాంజనేయులు స్వస్థలం చీమకుర్తి మండలం ఇలపావులూరు అయితే డెలివరీ కోసం కోటేశ్వరి అమ్మగారి ఊరైన మద్దులూరు వచ్చింది. కోటేశ్వరికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్నారు. అదృశ్యమైన పాప రమ్య రెండో కుమార్తె. తండ్రి హైదరాబాద్‌లో బేల్దార్ పనులకని వెళ్లాడు. కోటేశ్వరి డెలివరీకని వచ్చి మద్దులూరులోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. పాప ఆచూకీ తెలియాల్సి ఉందని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తులు పెంచడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో యువత, రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారించాయి. రూ.కోటి వరకు రుణం.. భారీ సబ్సిడీతో యూనిట్లు మంజూరు చేసి ఆర్థికంగా పురోభివృద్ధి సాధించే దిశగా చర్యలు చేపడుతున్నాయి. ఈ పథకం ద్వారా మేకలు, గొర్రెలు, కోళ్లు, పందుల పెంపకం, పశుగ్రాసం, దాణా ప్లాంట్‌ల ఏర్పాటుతోపాటు మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపర్చి ఔత్సాహికులకు అండగా నిలిచేలా ప్రణాళికలు రూపొందించాయి.

రూ.కోటి రుణం.. భారీ సబ్సిడీ



- గ్రామీణ యువత, రైతుల ఆర్థిక పురోగతి దిశగా చర్యలు
- గొర్రెలు, మేకల పెంపకం ద్వారా ఉపాధి
- కోళ్లు, పందుల పెంపకంతోనూ యూనిట్లు
- సైలేజీ, పశుగ్రాస దిమ్మెలు, సమీకృత దాణా యూనిట్లు కూడా..
- జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌తో ప్రోత్సాహం
- 10 నుంచి 50 శాతం సబ్సిడీ
- ఒక్కో యూనిట్ ద్వారా రూ.కోటి వరకు రుణ సదుపాయం
- నేడు ఒంగోలులో లబ్ధిదారులకు అవగాహన సదస్సు

గొర్రెలు/మేకల ఫారం(యూనిట్)	రాయితీ రూ.గరిష్టంగా
100 గొర్రెలు/మేకలు + 5 పొట్టేళ్లు/మేకపోతులు	రూ.10 లక్షలు
200 గొర్రెలు/మేకలు + 10 పొట్టేళ్లు/మేకపోతులు	రూ. 20 లక్షలు
300 గొర్రెలు/మేకలు + 15 పొట్టేళ్లు/మేకపోతులు	రూ.30 లక్షలు
400 గొర్రెలు/మేకలు + 20 పొట్టేళ్లు/మేకపోతులు	రూ.40 లక్షలు
500 గొర్రెలు/మేకలు + 25 పొట్టేళ్లు/మేకపోతులు	రూ.50 లక్షలు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర పశు సంవర్ధక శాఖ, కేంద్ర ప్రభుత్వ సంస్థ జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ నిధులతో అటు ఔత్సాహిక రైతులను, ఇటు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులను ఉపాధి అవకాశాల వైపు ప్రోత్సహించేందుకు సరికొత్త పథకాన్ని రూపొందించాయి. 2021–22 నుంచి 2025–26 వరకు ప్రణాళికలు రూపొందించి ప్రోత్సహిస్తున్నాయి. ఈ పథకంలో మేకలు, గొర్రెలు, కోళ్లు, పందుల పెంపకం, పశుగ్రాసం, దాణా తయారీలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా అసంఘటితంగా ఉన్న పశు సంవర్ధక రంగాన్ని వ్యవస్థీకృత రంగంలోకి తీసుకురావాలని పథకరచన చేశాయి. తద్వారా పాలు, గుడ్లు, మాంసం, ఉత్పత్తిని పెంచి వాటికి సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించటమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. ఔత్సాహికులు దరఖాస్తును నేరుగా ఆన్‌లైన్ ద్వారానే చేసుకోవాల్సి ఉంది. 500 గొర్రెలు, 25 పొట్టేళ్లతో కూడిన యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా గొర్రె లేదా మేక పిల్లల ఉత్పత్తి, పోషణ చేపడతారు. రూ.కోటి, అంతకు మించి ప్రాజెక్టు విలువ ఉంటే గరిష్ఠంగా రూ.50 లక్షల రాయితీ మంజూరు చేస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ మంజూరు చేస్తారు.

కోళ్ల అభివృద్ధి:

కోళ్ల అభివృద్ధి పథకంలో తక్కువ వ్యయంతో కూడిన సాంకేతికతతో 1000 కోడి పెట్టలు, 100 కోడి పుంజులు సామర్థ్యం ఉన్న పెరటి కోళ్ల యూనిట్ కోడి పిల్లల ఉత్పత్తి, పొదుగు కోళ్ల యూనిట్‌ల ఏర్పాటుకు రూ.50 లక్షలు మొదలుకొని అంతకుమించి ప్రాజెక్టు ఖరీదు ఉంటే గరిష్ఠంగా రూ.25 లక్షల రాయితీ. అంతకన్నా తక్కువగా ఉండే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ.

పందుల పెంపకం:

పందుల పెంపకంలో 100 ఆడ పందులు, 10 మగ పందులతో కూడిన యూనిట్ ఏర్పాటు చేసి దాని ద్వారా పంది పిల్లల ఉత్పత్తి, పోషణను చేపడతారు. రూ.60 లక్షలు మొదలు అంతకు మించి ప్రాజెక్టు ఖరీదు ఉంటే గరిష్ఠంగా రూ.30 లక్షల రాయితీ ఇస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ. అదేవిధంగా 50 ఆడ పందులు, 5 మగ పందుల యూనిట్ కోసం గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు రాయితీ ఇస్తారు.

■ పశుగ్రాసం, దాణా అభివృద్ధి పథకంలో సైలేజి తయారీ యూనిట్, పశుగ్రాస దిమ్మల తయారీ యూనిట్, సమీకృత దాణా తయారీ యూనిట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఒక్కో తయారీ యూనిట్ నెలకొల్పటానికి రూ.కోటి మొదలుకొని అంతకుమించి ప్రాజెక్టు విలువ ఉంటే గరిష్ఠంగా రూ.50 లక్షల రాయితీ మంజూరు చేస్తారు. అంతకంటే తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ అందిస్తారు.

■ ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ స్థాయిలో పశు ఉత్పత్తులైన పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తి పెంచుకొని అధిక ఆదాయం పొందటం ద్వారా గ్రామీణ యువతకు కల్పించేందుకు వీలు కలుగుతుంది. తద్వారా సుస్థిరతను, ఆత్మనిర్భరతను సాధించేందుకు వీలు కలుగుతుంది. అలాగే ఎగుమతుల ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని కూడా ఆర్జిస్తూ దేశ ఆర్థిక పురోగమనంలో పాలు పంచుకుంటారు.

లబ్ధిదారుల ఎంపిక ఇలా..

■ లబ్ధిదారుడు సంబంధిత ప్రాజెక్టు అంశంపై శిక్షణ పొంది ఉండాలి. ప్రాజెక్టు నిర్వహణపై అవగాహన అవసరం.

■ లబ్ధిదారుడు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్టు నివేదికను తయారుచేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

■ రాయితీ పోను మిగిలిన యూనిట్ ఖరీదు కోసం బ్యాంకు రుణంగా పొందటానికి అవసరమైన పత్రాలను సమర్పించాలి. బ్యాంకు అనుమతి అవసరం.

■ లబ్ధిదారుడు తన సొంత భూమి లేదా కౌలు భూమిలో మాత్రమే ప్రాజెక్టు ఏర్పాటు చేయాలి.

■ వీటిని రాష్ట్రస్థాయిలో ఏర్పాటయ్యే కమిటీ పరిశీలిస్తుంది.

■ నిబంధనల ప్రకారం అర్హతలున్న వారిని ఎంపిక చేసి నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌కు పంపిస్తారు.

అర్హతలు:

■ అనుభవం ఉన్న వ్యక్తిగత పశుపోషకులు, రైతు ఉత్పాదకత సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, సెక్షన్–8 కంపెనీల నుంచి అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

సబ్సిడీ విడుదల చేసే విధానం

▲ 50 శాతం సబ్సిడీ బ్యాక్‌ఎండ్ మూలధన సబ్సిడీ ప్రాజెక్టు ప్రకారం రెండు దఫాలుగా విడుదల చేస్తారు.

▲ బ్యాంకు మొదటి దశ రుణాన్ని లబ్ధిదారునికి అందించారన్న విషయాన్ని అధికారులు ధ్రువీకరించుకున్న తరువాత మాత్రమే మొదటి దఫా సబ్సిడీ మొత్తాన్ని రుణం మంజూరు చేసిన బ్యాంకుకు జమ చేస్తారు. ఆ సబ్సిడీని బ్యాంకు లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తుంది.

▲ ప్రాజెక్టు మొత్తం పూర్తయిన తరువాత అధికారులు ధ్రువీకరించుకొని రెండో దఫా సబ్సిడీకి కూడా లబ్ధిదారులను అర్హులుగా పరిగణిస్తారు.

నేడు అవగాహన సదస్సు



గ్రామీణ యువతకు, గ్రామాల్లోని ఔత్సాహిక రైతులకు జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకంపై ఒంగోలు నగరంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశాం. శనివారం ఒంగోలులోని సంతపేటలోని ఆచార్య ఎన్‌జీ రంగా భవన్‌లో ఉదయం 10 గంటలకు రైతు సదస్సు నిర్వహిస్తున్నాం. ఔత్సాహికులకు ఈ పథకంపై అవగాహన కల్పిస్తాం. సదస్సులో కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, జేసీ డాక్టర్ కే.శ్రీనివాసులు, పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారు. రైతులు, ఆర్‌బీకే, మండల, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు, సభ్యులు, జిల్లాలోని గొర్రెల, మేకల పెంపకం దారుల సహకార సంఘ ప్రెసిడెంట్లు, సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కే.బేబీ రాణి, జేడీ, జిల్లా పశుసంవర్ధక శాఖ

వాహనాలపై ఆధారపడిన వారికి భరోసా



వైఎస్సార్ వాహనమిత్ర చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు



ఆటోవాలాలు నిర్వహించిన ఆటో ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

- వైఎస్ఆర్ వాహనమిత్ర కింద జిల్లాలో 10,741 మందికి లబ్ధి
- స్పందన భవనంలో 'వాహనమిత్ర' కార్యక్రమం
- పాల్గొన్న ఎంపీ మాగుంట, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు అర్బన్: ఆటో, టాక్సీ వంటి అద్దె వాహనాలను వృత్తిగా తీసుకుని జీవించే వారికి వైఎస్ఆర్ వాహనమిత్ర ఒక భరోసా కల్పిస్తుందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. ఈ పథకం ద్వారా పొందిన నగదును వాహన అవసరాల కోసం వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం కింద లబ్ధిదారులకు ఐదో విడత డబ్బులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తున్న నేపథ్యంలో విజయవాడ విద్యాధరపురంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. దీనికి అనుబంధంగా స్పందన భవనంలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. దీనిలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు బ్యాంకు చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సొంత వాహనం కలిగి స్వయం ఉపాధి పొందుతున్న ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్‌లు, ఎండీయూ ఆపరేటర్లకు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, అవసరమైన మరమ్మతులు చేయించుకునేందుకు వైఎస్ఆర్ వాహనమిత్ర పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. జిల్లాలో 2023–24 సంవత్సరానికి 10,741 మందికి రూ.10.74 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ఈ నగదుతో లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గుతుందని చెప్పారు.

జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనగుణంగా అనేక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే వైఎస్ఆర్ వాహనమిత్ర పథకాన్ని ఏర్పాటు చేసి వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. గతంలో వాహన యజమానులు వారికున్న ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా వాహనబీమా, మరమ్మతులు చేయించుకోలేకపోవడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబం మొత్తం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ఈ పథకం లబ్ధిదారులకు అండగా ఉంటోందని చెప్పారు.

ఎంపీ మాగుంట మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రతి ఏడాది లబ్ధిదారులకు రూ.10 వేల చొప్పున ఇవ్వడం వల్ల వారికి ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి అమలు చేస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిలో డీటీసీ సుశీల, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వీరే

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత జాబితాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. అర్బన్ మండలాలు, నగరాలు, పట్టణాలు ఉన్నచోట్ల క్లస్టర్ ఇన్‌చార్జులను కలుపుకుని మొత్తం 47 మందిని నియమించారు.

సంతనూతలపాడు నియోజకవర్గం:

నాగులుప్పలపాడు: శ్రీమన్నారాయణ, మద్దిపాడు: మండవ అప్పారావు, సంతనూతలపాడు: దుంపా చెంచిరెడ్డి, చీమకుర్తి: పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి అర్బన్: క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి, ఒంగోలు క్లస్టర్ 4: గోలి కోటేశ్వరమ్మ.

యర్రగొండపాలెం నియోజకవర్గం:

వై.పాలెం: ఓబుల్‌రెడ్డి, దోర్నాల: గంటా రమణారెడ్డి, త్రిపురాంతకం: పోలిరెడ్డి, పెద్దారవీడు: పాల్‌రెడ్డి క్రిష్టారెడ్డి, పుల్లలచెరువు: బోగోలు వెంకట సుబ్బారెడ్డి

దర్శి నియోజకవర్గం:

దొనకొండ: కందుల నారపరెడ్డి, ముండ్లమూరు: బిజ్జం సుబ్బారెడ్డి, కురిచేడు: యెన్నాబత్తుల వెంకట సుబ్బయ్య, తాళ్లూరు: తూము వెంకట సుబ్బారెడ్డి, దర్శి: మెన్నపూస వెంకటరెడ్డి, దర్శి మున్సిపాలిటీ: కట్టి కోట హరీష్

ఒంగోలు నియోజకవర్గం:

కొత్తపట్నం: డాక్టర్ రాఘవరావు, ఒంగోలు రూరల్: చుంచు రామకృష్ణ, ఒంగోలు మున్సిపాలిటీ క్లస్టర్ 1: రాయపాటి అంకయ్య, క్లస్టర్ 2: బాలిశెట్టి నాగేశ్వరరావు, క్లస్టర్ 3: బొమ్మినేని మురళి

కొండపి నియోజకవర్గం:

కొండపి: ఆరికట్ల కోటిలింగం, టంగుటూరు: మల్లవరపు రాఘవరెడ్డి, మర్రిపూడి: దద్దాలి మల్లిఖార్జున, సింగరాయకొండ: సామంతుల రవికుమార్‌రెడ్డి, జరుగుమల్లి: బత్తిన మదన మనోహర్‌రావు, పొన్నలూరు: పల్లపోలు బాలకోటిరెడ్డి

గిద్దలూరు నియోజకవర్గం:

అర్థవీడు: డాక్టర్ చేగిరెడ్డి పోతిరెడ్డి, బేస్తవారిపేట: కొండా రఘునాథ్‌రెడ్డి, కంభం: గొంగటి చెన్నారెడ్డి, కొమరోలు: బోయెల జనార్ధన్‌రెడ్డి, రాచర్ల: సీఆర్‌ఐ మురళి, గిద్దలూరు నగర పంచాయతీ: షేక్ హరేమ్ రషీద్

కనిగిరి నియోజకవర్గం:

వెలిగండ్ల: గజ్జెల వెంకటరెడ్డి, పామూరు: జి.హుస్సేన్ రెడ్డి, హనుమంతునిపాడు: యక్కంటి శ్రీనివాసరెడ్డి, సీఎస్‌పురం: భువనగిరి వెంకటయ్య, పీసీపల్లి: గోపవరపు బొర్రారెడ్డి, కనిగిరి రూరల్ మండలం: సంగు సుబ్బారెడ్డి, కనిగిరి నగర పంచాయతీ: రంగనాయకులు రెడ్డి.

మార్కాపురం నియోజకవర్గం:

మార్కాపురం పట్టణం: షేక్ ఇస్మాయిల్, తర్లుపాడు: మురారి వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల: మోరా శంకర రెడ్డి, పొదిలి మండలం: దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, పొదిలి నగర పంచాయతీ: షేక్ నూర్జహాన్, మార్కాపురం: పిన్నెబోయిన సత్యన్నారాయణ.

మోడల్ డెయిరీ సందర్శనకు పాడి రైతులు పయనం

ఒంగోలు సబర్బన్: మోడల్ డెయిరీ క్షేత్ర దర్శనార్థం జిల్లాకు చెందిన అభ్యుదయ పాడి రైతులు శుక్రవారం పాయకరావు పేటకు బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు స్థానిక రంగారాయుడు చెరువు సమీపంలో ఉన్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి వారికి కేటాయించిన ప్రత్యేక బస్సులో అనకాపల్లికి వెళ్లారు. జిల్లాకు చెందిన రాష్ట్రీయ లైవ్‌స్టాక్ మిషన్ సౌజన్యంతో, గుంటూరు ప్రాంతీయ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 40 మంది అభ్యుదయ రైతులు వెళ్లారు. అభ్యుదయ రైతులు మోడల్ డెయిరీలో కొనసాగుతున్న కార్యకలాపాలను గమనించి అవగాహన చేసుకునేందుకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కోసూరి రాధా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ షేక్ కాలేషా, ఉప సంచాలకులు డాక్టర్ ఏ.రమేష్ బాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

పేదల గుండె తడి తెలిసిన వ్యక్తి జగనన్న

- విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం
- మెరుగైన వైద్యం అందించేందుకే జగనన్న సురక్ష పథకం
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెతడి తెలిసిన వ్యక్తి కావడంతో వారి ఆరోగ్యంపట్ల ఎనలేని శ్రద్ధ చూపుతున్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటింటికీ మంచి వైద్యం అందే కార్యక్రమాన్ని చేపడుతున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని నరసాయపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చికిత్స కంటే నివారణ చాలాగొప్పదన్న ఉద్దేశంతో రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలని దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారని, మరింత మెరుగైన వైద్యం అందించేందుకు జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించారన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ వైద్యశాలల పట్ల నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం:

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు తగిన అర్హతలు ఉంటే చాలని, కుల, మత, వర్గాలు, రాజకీయ పార్టీలతో ఎటువంటి సంబంధం ఉండదని అన్నారు. పింఛన్లతోపాటు సంక్షేమ పథకాలు అర్హులైనవారందరికీ ప్రభుత్వం అందజేస్తోందన్నారు.

జగనన్నను మరోసారి సీఎంగా చేసుకోవటానికి రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా రాష్ట్రంలో ఉన్న 175 అసెంబ్లీ స్థానాలు ఆయనకు బహుమతిగా ఇచ్చేందుకు వారు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ముందుగా రూ.40 లక్షల ఖర్చుతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఏఎంసీ డైరెక్టర్ కందుల సత్యనారాయణ, షేక్ కాశింబాష, డీఎల్‌డీవో బి.వి.ఎస్. సాయికుమార్, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, పీఆర్ డీఈ ఎం.సుబ్బారెడ్డి, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఎంఈవో పి.ఆంజనేయులు, ఏడీఏ కె.నీరజ, ఏవో జవహర్‌లాల్ నాయక్, ఏఈలు శ్రీకాంత్, అల్లూరయ్య పాల్గొన్నారు.

వైభవంగా బుద్ధుని విగ్రహావిష్కరణ



బుద్ధుని విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



పూజలు చేస్తున్న బౌద్ధ భిక్షువులు

త్రిపురాంతకం: మండలంలోని మేడపిలో నూతనంగా ఏర్పాటు చేసిన సిద్ధార్థ నగర్ బౌద్ధక్షేత్రంలో బుద్ధ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. బౌద్ధ భిక్షువులతో కలిసి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ దీనిని ఆవిష్కరించారు. బౌద్ధ భిక్షువులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ బుద్ధుని ఆశయాలు అందరికీ ఆచరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అందించిన మార్గంలో నడిచి తోటివారికి ప్రేమను పంచాలన్నారు. ఈ విగ్రహ ఆవిష్కరణను స్థానిక ఎంపీటీసీ వైఎస్సార్ సీపీ నాయకుడు పాటిబండ్ల కృష్ణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పిచ్చయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్య

- భర్తతో కలిసి రేపు థాయ్‌లాండ్ టూర్‌కు వెళ్లాల్సి ఉండగా ఉరేసుకుని బలవన్మరణం
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



కళ్యాణి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాజారావు

పొన్నలూరు: ఉరి వేసుకుని అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మంగపాటివారిపాలెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొప్పోలు కళ్యాణి (38) వెల్లటూరు పంచాయతీలో అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వర్తిస్తోంది. ఆమె భర్త సురేష్ వ్యవసాయం చేస్తూనే ఓ ప్రైవేట్ మార్కెట్ కంపెనీలో ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. మార్కెట్ కంపెనీలో సురేష్ బాగా పనిచేయడంతో ఆ కంపెనీ వారు సురేష్ కుటుంబానికి అక్టోబర్ 1వ తేదీ థాయ్‌లాండ్ టూర్ ఏర్పాటు చేశారు. దీంతో సురేష్, కళ్యాణి థాయ్‌లాండ్ వెళ్లడానికి ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఏమైందో ఏమోగానీ గురువారం రాత్రి అందరూ నిద్రించిన తర్వాత శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం నిద్రలేచిన భర్త సురేష్ గమనించి చుట్టుపక్కల వారి సాయంతో కిందికి దించి చూడగా అప్పటికే కళ్యాణి మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై దాసరి రాజారావు సంఘటన స్థలానికి చేరుకుని కళ్యాణి మృతదేహాన్ని పరిశీలించారు. ఆపై మృతిపై అనుమానాలున్నాయని, ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జీవనశైలి మార్పుతోనే గుండెకు రక్షణ

- కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట
- వివిధ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఘనంగా వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాలు



ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో బెలూన్లు ఎగురవేస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 3 కేఎం వాక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మనిషి జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. శుక్రవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నగరంలోని పలు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేర్వేరు హాస్పిటల్స్‌లో కలెక్టర్, ఎంపీ విడివిడిగా పాల్గొని మాట్లాడారు.

కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 3 కేఎం వాక్‌ను ప్రారంభించిన కలెక్టర్...

కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుండె జబ్బులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన 3 కిలోమీటర్ల నడకను కలెక్టర్ దినేష్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్ హార్ట్ డే సందర్భంగా యూజ్ హార్ట్ ఫర్ ఎవ్రీ హార్ట్ అనే థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. మంచి ఆహారపు అలవాట్లతో పాటు ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా హృద్రోగాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో...

ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో యూజ్ యువర్ హార్ట్ అండ్ నో యువర్ హార్ట్ అనే అంశంపై చేపట్టిన బైక్ అండ్ కార్ ర్యాలీని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి బెలూన్‌లు ఎగురవేసి, జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్, కర్నూలు రోడ్డు, కొత్తపట్నం బస్టాండ్, ప్రకాశం భవనం మీదుగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ గుండె జబ్బులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంటే రక్షణ పొందవచ్చన్నారు. ఆస్టర్ రమేష్‌లో గుండె జబ్బుల చికిత్సకు అత్యాధునిక యంత్రాలు, వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం హర్షనీయమన్నారు. హాస్పిటల్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు రాయితీపై గుండె వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ కార్డియాలజిస్ట్ సెంథిల్‌కుమార్, సీఓఓ హరికుమార్‌రెడ్డి, ఇతర డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్ ఆధ్వర్యంలో...

స్థానిక జీజీహెచ్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే కార్యక్రమాలు నిర్వహించారు. మెడికల్ విద్యార్థులు, ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది కార్యక్రమాల్లో పాల్గొని రోగులకు గుండె వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్, ఆర్‌ఎంఓ చైతన్య వర్మ, ప్రొఫెసర్లు, డాక్టర్లు పాల్గొన్నారు.

మహిళా కళాశాలను సందర్శించిన నాక్ పీర్ టీం

- టీం ప్రతినిధులతో చర్చించిన ఒంగోలు ఎంపీ మాగుంట



నాక్ పీర్ టీం ప్రతినిధులతో చర్చిస్తున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు: ఉన్నత విద్యా సంస్థను అంచనా వేయడానికి కౌన్సిల్ నియమించిన నాక్ పీర్ టీం శుక్రవారం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా కాలేజీని సందర్శించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఒంగోలు వచ్చిన ముగ్గురు సభ్యులతో కూడిన ఈ టీంకి చైర్మన్‌గా బెంగళూరుకు చెందిన పూర్వ ఉపకులపతి డాక్టర్ పి.నారాయణస్వామి వ్యవహరించారు. కో ఆర్డినేటర్ మెంబర్‌గా అహల్య విశ్వవిద్యాలయం మానవ వనరుల అభివృద్ధిశాఖ డైరెక్టర్ దేవి అహల్య, సభ్యులుగా తిరుచిరాపల్లి సెయింట్ జోసెఫ్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరోకియాసామి ఉన్నారు. కాలేజీలోని అన్ని శాఖలను వారు సందర్శించి వసతులను పరిశీలించారు. పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కాలేజీ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కమిటీ ప్రతినిధులతో చర్చించారు. కాలేజీ విద్య జోన్ 3 ఆర్‌జేడీ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి కూడా కమిటీ సభ్యులతో పాటు ఉండి విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను సభ్యులు తిలకించారు. ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి అధ్యక్షత వహించారు. నాక్ పీర్ టీం సభ్యులు శనివారం కూడా కాలేజీని సందర్శించనున్నారు.





పారదర్శకంగా ఓటర్ల జాబితా పరిశీలన



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఓటర్ల జాబితా పరిశీలన పారదర్శకంగా జరుగుతుందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ కేంద్రాల మార్పులు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు గురించి వివరించారు. 8 నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు జరిగిన ఓటరు లిస్టు పరిశీలన, ఫారం-6, 7, 8, 6బీపై జరిగిన ప్రక్రియలను వివరించారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, అందుకు రాజకీయ పార్టీలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీలత, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషాబేగ్, రాజశేఖర్, సత్యం, ఎస్‌కే రసూల్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం భరోసా

- స్టెప్ సీఈఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ లోకేశ్వరరావు

మద్దిపాడు:విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిచ్చే విధంగా పదో తరగతి తర్వాత వివిధ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని స్టెప్ సీఈఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు తెలిపారు. మద్దిపాడు మండలంలోని తెల్లబాడు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన కలెక్టర్ గారి అతిథి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 9, 10 తరగతుల విద్యార్థులు పదో తరగతి తర్వాత చేయాల్సిన కోర్సుల్లో కనీసం ఐదు నుంచి పది కోర్సుల గురించి తెలుసుకుని సరైన కోర్సును ఎంపిక చేసుకోవాలని సూచించారు. తద్వారా భవిష్యత్తును మంచిగా మలచుకోవాలన్నారు. మూసగా అందరూ ఎంపీసీ, బైపీసీ అంటూ వెళ్తుంటారని, కానీ, అనేక రకాల ఇతర మంచి కోర్సులు కూడా ఉన్నాయని తెలిపారు. వాటిలో సరైన కోర్సును ఎంపిక చేసుకుంటే ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి అనువుగా ఉంటుందన్నారు. విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ చాలా ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ డీఈఓ టి.భరద్వాజ్, డీఎస్‌డీఓ ఆర్.లోకనాథం, స్టెప్ మేనేజర్ పీ శ్రీమన్నారాయణ, కెరియర్ గైడెన్స్ మెంటర్ ఎస్‌కే షహనాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాదర్‌బాషా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక

జరుగుమల్లి: రెండో జాతీయ స్థాయి రూలర్ స్కేటింగ్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ పోటీలకు క్రీడాకారుల ఎంపికను ఒంగోలులోని రామ్‌నగర్ 14వ లైనులో గల టార్గెట్ థ్రిల్ బేస్ కోచింగ్ సెంటర్ ఆవరణలో శనివారం నిర్వహించనున్నట్లు ఎస్‌కేఐ స్నో బోర్డు ప్రతినిధి, జిల్లా రెజ్లింగ్ కార్యదర్శి పి.సురేష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్కిస్నో బోర్డు అధ్యక్షుడు సి.వెంకటేశ్వరప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు టార్గెట్ థ్రిల్ బేస్ కోచింగ్ ఇన్‌చార్జి బి.లక్ష్మి (91005 52070)ని సంప్రదించాలన్నారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో పరవాడ గుజరాత్ పబ్లిక్ స్కూల్, గుజరాత్‌లో స్కిస్నో బోర్డు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని సురేష్‌రెడ్డి తెలిపారు.

వల్లూరమ్మ ఆలయ హుండీల ఆదాయం రూ.13,22,447



వల్లూరమ్మ ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన మండలంలోని వల్లూరు గ్రామంలో గల వల్లూరమ్మ ఆలయంలో హుండీలను దేవదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు సమక్షంలో శుక్రవారం లెక్కించారు. మొత్తం 64 రోజులకుగానూ 10 హుండీలను లెక్కించగా రూ.13,22,447 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో బి.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమాశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు, సేవా సంఘ భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పూర్తి



అండర్ -17 ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలికల జట్టు



అండర్ -17 బాలుర జట్టు

జే.పంగులూరు: మండల పరిధిలోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో అండర్ -17, అండర్-14, అండర్-19 విభాగాల్లో జిల్లా నలుమూలల నుంచి 400 మంది పైగా విద్యార్థులు సెలక్షన్‌లో పాల్గొన్నారు. అండర్-17 క్రీడాకారులను జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కే వనజ, రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, జిల్లా కార్యదర్శి కాశీవిశ్వనాథరెడ్డి, ట్రెజరర్ కే హనుమంతురావు, పీడీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముందుగా నిర్వహించిన సమావేశంలో అతిథులుగా వచ్చిన వైఎస్సార్ సీపీ మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు మాట్లాడుతూ 3 దశాబ్దాల పైగా ఖోఖో క్రీడలకు పంగులూరు పెట్టింది పేరు అన్నారు. ఈ గ్రామంలో ఆడిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని తమ సత్తా చాటారన్నారు. జగనన్న ప్రభుత్వం క్రీడాకారులకు అందిస్తున్న ఫలాలు సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తు పొందాలని కోరారు. వచ్చిన క్రీడాకారులకు భోజన సదుపాయాలు గ్రామ పెద్దలు, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ వారు సమకూర్చినట్లు సీతారామిరెడ్డి తెలిపారు. ఎంపిక చేసిన అండర్-18 జట్టు చిత్తూరులో 20 నుంచి 22 వరకు అక్టోబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. అండర్-19 విభాగంలో బాలుర ఖోఖో జట్టు ఎంపికను జూనియర్ కళాశాల స్కూల్ గేమ్స్ సెక్రటరీ బీ ఆదినారాయణ, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఎంపిక చేశారు. అండర్-18 విభాగంలో బాలుర జట్టును ప్రకాశం జిల్లా ఖోఖో కార్యదర్శి బీ కాశీవిశ్వనాథరెడ్డి, ట్రెజరర్ కే హనుమంతురావు, బీ శ్రీనివాసరెడ్డి, ఎంపిక చేశారు.



అండర్ -19 బాలుర జట్టు



జూనియర్ బాలుర జట్టు